క్లుప్తంగా

సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారీ



చాట్రాయి: చెత్త సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి నాగరాజు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పోలవరం, చనుబండ, పర్వతాపురం, మర్లపాలెం గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారు చేసేందుకు వానపాములు ఏర్పాటు చేశామని, 40 రోజుల్లో వర్మీ కంపోస్టు తయారవుతుందని చెప్పారు. వారం రోజుల్లో అన్ని గ్రామాల్లోని సంపద కేంద్రాల్లో వానపాములు ఏర్పాటు చేస్తామన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



చాట్రాయి: సైబర్ నేరాలపై కిశోర బాలికలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ గాయత్రీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని చాట్రాయి అంగన్వాడీ కేంద్రంలో సైబర్ నేరాలపై కిశోర బాలికలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఫోన్లో చాటింగ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. మీ చిరునామా, ఫోన్ నంబర్, వ్యక్తిగత సమాచారాన్ని ఆన్లైన్లో అపరిచితులకు షేర్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది యోగా సాధన



విస్సన్నపేట: యోగాడేను పురస్కరించుకొని జూన్ 21వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో సచివాలయాల పరిధిలో రోజుకు గంట పాటు యోగాసనాల కార్యక్రమం నిర్వహించాలని తహసీల్దార్ కె లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో సచివాలయ సిబ్బందికి యోగాసనాలపై ట్రైనర్తో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బందితో యోగాసనాలు వేశారు.

కృత్రిమ కాళ్లు అందజేత



ఆగిరిపల్లి: దివ్యాంగులకు తోటపల్లి హీల్ సంస్థలో మంగళవారం కృత్రిమ కాళ్లను అందజేశారు. మానవత స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సహాయంతో గన్నవరానికి చెందిన కొల్లూరు మరియమ్మకు కృత్రిమ కాళ్లను అందించారు. హీల్ సంస్థ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, గన్నవరం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మడుపల్లి బాలకృష్ణమూర్తి, కార్యదర్శి వరప్రసాదరావు, కోశాధికారి పొట్లూరు రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ప్రసాద్రావు పాల్గొన్నారు.

జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి



తిరువూరు: భారత దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ వర్ధంతి కార్యక్రమం స్థానిక రాజీవ్భవన్లో మంగళవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లెపాటి శ్రీనివాసరావు, బొడ్డు ప్రకాశరావు, జీవన్బాబు, ఉప్పలపాటి లక్ష్మీదాసు, గంజా కృష్ణమోహన్ తదితరులు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అభిషేక పాత్ర సమర్పణ



తిరువూరు: స్థానిక దాసాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారి విశేష అభిషేకాల నిమిత్తం తిరువూరుకు చెందిన మైలవరపు కృష్ణారావు దంపతులు మంగళవారం అభిషేకపాత్రను అందజేశారు. ఆలయంలో స్టీలు బల్లల ఏర్పాటుకు రిటైర్డు పోస్టల్ ఉద్యోగి మాయిరి వెంకటేశ్వరరావు, వింజామరలను నల్లాని చక్రవర్తుల వరద రాజాచార్యులు అందజేశారని ఆలయ కమిటీ తెలిపింది.

ఉచితం గ్యాసేనా?



చంద్రబాబు ఇచ్చిన ఉచిత గ్యాస్ హామీ పోస్టర్



- జమ కాని గ్యాస్ సిలిండర్ రాయితీ సొమ్ములు
- లబ్ధిదారుల ఎదురుచూపులు
- రెండో విడత డబ్బులు పడడం లేదంటూ ఆవేదన

ఆగిరిపల్లి: కూటమి ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన ఉచిత గ్యాస్ పథకం తుస్సుమంటోంది. రెండో విడతకే సబ్సిడీ చెల్లింపులపై ప్రభుత్వం చేతులెత్తేసినట్లుంది. గ్యాస్ సిలిండర్లు డెలివరీ అయిన 48 గంటల్లోగా రాయితీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తామని చెప్పిన మాటలు గాల్లో కలిసిపోయాయి. రోజులు గడుస్తున్నా రాయితీ సొమ్ము జమ కాకపోవడంతో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో మొత్తం 26 వేల గ్యాస్ కనెక్షన్ల ఉండగా 21,400 మంది అర్హులు ఉన్నారు. దీనిలో మొదటి గ్యాస్ సిలిండర్కు 19,030 మందికి నగదు జమ అయ్యాయి.

నిబంధనల మీద నిబంధనలు

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ప్రతి ఒక్కరికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అధికారం చేపట్టిన తర్వాత ఎప్పటి మాదిరిగానే నిబంధనల మీద నిబంధనలు పెట్టడం మొదలు పెట్టారు. ఉచిత సిలిండర్లు రావాలంటే రైస్ కార్డు తప్పనిసరి అని నిబంధన పెట్టారు. తెల్ల రేషన్ కార్డు మనుగడలో ఉంటేనే మూడు ఉచిత సిలిండర్లు దక్కనున్నాయి. రేషన్ కార్డు లేకపోతే ఈ పథకానికి నోచుకోలేరు. అలాగే ఈకేవైసీ కూడా తప్పనిసరి.

మొదలైన రాయితీ తిప్పలు

ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలులో భాగంగా మొదటి విడత పూర్తయి రెండో విడత ఏప్రిల్ నుంచి ప్రారంభమైంది. గ్యాస్ బుకింగ్ ప్రారంభమై సిలిండర్లు కూడా డెలివరీ చేసుకున్నారు. ఇందుకు ఎల్పీజీ కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరి చేశారు. ఇవన్నీ ఉంటేనే లబ్ధిదారులకు సిలిండర్ వస్తుంది. రెండో విడతలో గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకుని నెలన్నర గడుస్తున్నా సబ్సిడీ డబ్బులు మాత్రం జమ కావడం లేదని మహిళలు వాపోతున్నారు.

డబ్బులు జమ కాలేదు



గ్యాస్ బుక్ చేసుకున్నాం. డబ్బులు చెల్లించి సిలిండర్ తీసుకున్నాం. అయితే ఇంతవరకు బ్యాంకు ఖాతాలో మాత్రం రాయితీ సొమ్ము జమ కాలేదు. ఏజెన్సీ వద్దకు వెళ్లి అడిగాం. ఖాతాలో జమవుతాయని చెబుతున్నారు. రాయితీ సొమ్ము జమవుతుందో లేదో తెలియడం లేదు.

– వరలక్ష్మి, ఆగిరిపల్లి

నెలన్నరైనా డబ్బులు పడలేదు



ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పారు. మేము రెండో సిలిండర్ తీసుకొని నెలన్నర దాటిపోయింది. అయినా ఇంతవరకు డబ్బులు పడలేదు. 48 గంటల్లో పడతాయని చెప్పారు. గ్యాస్ డబ్బులు చెక్ చేసుకునేందుకు ఏజెన్సీ, బ్యాంక్ చుట్టూ తిరగలేకపోతున్నాం.

– గురజాల ప్రశాంతి, కనసానపల్లి

నవోదయం 2.0 విజయవంతం చేయాలి

తిరువూరు ఆర్డీఓ మాధురి



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ మాధురి

తిరువూరు: సారా రహిత సమాజ నిర్మాణానికి చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని తిరువూరు ఆర్డీఓ కె. మాధురి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం నవోదయం 2.0 పై సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 19 గ్రామాల్లో సారా తయారీ, అమ్మకాలు జరుగుతుండగా వీటిని ఏబీసీ కేటగిరీలుగా విభజించి సారా నిరోధానికి చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ గ్రామాల్లో ఇప్పటివరకు 123 కేసులు నమోదు చేసి 143 మంది నిందితులను అరెస్టు చేశామని, 324.5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 23,450 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామని అధికారులు వివరించారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేయడానికి, సారా తాగడం వలన కలిగే అనర్థాలు వివరిస్తూ మార్పు తీసుకురావడానికి నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం విజయవంతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామశివ, తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, రెడ్డిగూడెం, విస్సన్నపేట మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్లు, ఎక్సైజ్ ఎస్ఐలు, అటవీ అధికారులు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పర్చాలి

డీఎల్పీఓ జీఎల్ఎన్వీ రాఘవన్

ఇబ్రహీంపట్నం: వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు మెరుగు పర్చాలని డీఎల్పీఓ జీఎల్ఎన్వీ రాఘవన్ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గుంటుపల్లి, జూపూడి గ్రామాల్లోని పారిశుద్ధ్యం పనులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. ఇంటింటి చెత్త సేకరణపై ఆరా తీశారు. తడి, పొడి చెత్త సేకరణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వర్మి కంపోస్టు తయారీ, అమ్మకాల వివరాలపై ఆరా తీసి రికార్డులు తనిఖీ చేశారు. పారిశుద్ధ్యం, నీటి సరఫరాపై ఆయా గ్రామాల కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. డెప్యూటీ ఎంపీడీఓ మనోజ్కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు జి.మునేశ్వరరావు, వైఎస్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విత్తనాల ఎంపిక కీలకం

ముసునూరు: ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగా పలకరిస్తాయనే వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో ఖరీఫ్ సీజన్ ముందస్తుగా ప్రారంభం కావచ్చని, ఈ దశలో వరి, పత్తి పంటల విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి కె.చినసూరిబాబు రైతులకు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలను ఎంపిక చేసుకుంటే, పంట దిగుబడులు రాక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. రైతులను మోసగిస్తూ నకిలీ, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు చేపట్టి, కేసులు నమోదు చేస్తామని విత్తన దుకాణదారులను హెచ్చరించారు. రైతులు విత్తనాల ఎంపిక, కొనుగోలు విషయంలో జాగ్రత్త పడాలని మందులు, ఎరువులు, విత్తనాల కొనుగోలుకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు.

వ్యవసాయ పరికరాలు అందజేత

మైలవరం: వెల్వడం గ్రామంలో రైతులకు వ్యవసాయ పరికరాలను టీడీపీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కోమటి సుధాకరరావు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు సబ్సిడీలో కావలసిన పరికరాలు అందిస్తుందన్నారు.

కొనసాగుతున్న విజ్ఞాన శిబిరాలు



నూజివీడులో మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

నూజివీడు: పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు విద్యార్థులతో పుస్తక సమీక్ష నిర్వహించారు. విశ్వకవి, జాతీయగీత రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను గ్రహించి బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- మైలవరం: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని, గ్రంథాలయాల సేవలు సద్వినియోగం చేసుకోవాలని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల గ్రంథాలయ పాలకుడు డాక్టర్ టి. సాంబశివరావు అన్నారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులతో నీతి కథల పుస్తకాలు చదివించారు. ఎల్బీఆర్సీఈ గ్రంథాలయ పాలకులు డాక్టర్ టి. సాంబశివరావు మాట్లాడుతూ నేటి సమాజంలో గ్రంథాలయాల వలన కలిగే ప్రయోజనాలు, గ్రంథాలయ చరిత్రను విద్యార్థులకు వివరించారు. పఠనాసక్తి ఏ విధంగా పెంపొందించుకోవాలో తెలిపారు. విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మ్యాట్ ల్యాబ్తో విస్తృత ప్రయోజనాలు

వన్టౌన్(విజయవాడపశ్చిమ): అధునాతన సిగ్నల్ ప్రాసెసింగ్, కంట్రోల్ సిస్టమ్ తయారీతో సహా ఆటోమేషన్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఏరోనాటిక్స్ రంగాలతో అనేక అప్లికేషన్ల అభివృద్ధిలో మ్యాట్ ల్యాబ్ కీలకపాత్ర పోషిస్తోందని ప్రముఖ గణిత విద్యావేత్త, అమృత విశ్వ మహావిద్యాలయం గణిత విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కేబీఎన్ కళాశాల గణితం, సాంఖ్యక శాస్త్ర విభాగం, రీసెర్చ్ సెల్ సంయుక్త నిర్వహణలో మంగళవారం ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ మ్యాట్ల్యాబ్ అత్యంత ఆధునికమైన ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ అని చెప్పారు. న్యూమరికల్ కంప్యూటింగ్ కోసం దీనిని అభివృద్ధి చేశారన్నారు. గణిత నమూనాలు రూపొందించడం, డేటా విశ్లేషణ, ఇంటర్ప్రెటేషన్, పరిశోధనలకు అవసరమైన సిమ్యులేషన్, టెస్టింగ్ రంగాలు మ్యాట్ ల్యాబ్ ఉపయోగించడం ద్వారా అత్యంత అభివృద్ధి చెందాయని వివరించారు. విద్యార్థుల్లో పరిశోధన నైపుణ్యాలు పెంచి, గణితంపై ఆసక్తి పెంచటానికి మ్యాట్ల్యాబ్ దోహదపడుతుందన్నారు. గణిత గణనలను వేగంగా, కచ్చితంగా నిర్వహించడం మ్యాట్ల్యాబ్ ద్వారా సాధ్యమవుతుందని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి మాట్లాడుతూ గణితశాస్త్ర అనువర్తనం లేని రంగం ఏదీ ఉండదని, గణిత పరిశోధనల ద్వారా ఉపాధ్యాయులు మరింత ఉన్నతంగా బోధించడం సాధ్యమవుతుందని వివరించారు. హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

విస్సన్నపేట: మండలంలోని రైతు సేవా కేంద్రాల వద్ద పచ్చిరొట్ట విత్తనాలు పిల్లిపెసర, జనుము, మిక్స్డ్ కిట్స్ 50 శాతం రాయితీపై రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖాధికారి రాజ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ మేరకు పలు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల వద్ద పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు సబ్సిడీపై పంపిణీ చేశారు.

విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ



నందిగామరూరల్: ప్రముఖ కంపెనీల సహకారంతో విద్యార్థినులకు ఉద్యోగ, ఉపాధికి తోడ్పాటునందించే నైపుణ్యాభివృద్ధి శిక్షణనిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు ఇన్ఫోసిస్ కంపెనీ ప్రత్యేకంగా రూపొందించిన బస్సులో మంగళవారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో కంట్రోలర్ బేస్డ్ ప్రాజెక్ట్స్, ఎనర్జీ కన్జర్వేషన్స్ తదితర అంశాలపై బస్సులో శిక్షణ ఇచ్చామన్నారు. 50 మంది విద్యార్థినులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్బాబు, ట్రైనర్ భాను, నందిగామ స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ చరణ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

30న తిరువూరులో జాబ్మేళా

తిరువూరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం ఆధ్వర్యంలో తిరువూరులో ఈ నెల 30న జాబ్మేళా జరుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సుశీలరావు తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సుగల 10, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ తదితర అర్హతలున్న అభ్యర్థులు మేళాకు హాజరుకావచ్చని చెప్పారు. పది కంపెనీలు ఈ మేళాలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తాయన్నారు. ఆసక్తిగల వారు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

ముగిసిన ఈఏపీ సెట్ పరీక్షలు



తిరువూరు: స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 19న ప్రారంభమైన ఈఏపీ సెట్ పరీక్షలు మంగళవారం ముగిశాయి. ఈ కేంద్రానికి 2,100 మంది విద్యార్థులను కేటాయించగా, 1,799 మంది పరీక్షలకు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ రంగా నాగేంద్రబాబు తెలిపారు.

రీ సర్వే లోపాలను సరిచేస్తాం



కొత్తగూడెంలో రీ సర్వే లోపాలను జేసీకి వివరిస్తున్న రైతులు

చాట్రాయి: రీ సర్వేలో వచ్చిన లోపాలను సరిచేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తగూడెం గ్రామంలో రీ సర్వేలో వచ్చిన మార్పులపై ఆమె రైతులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఒక గ్రామానికి చెందిన భూములు వేరే గ్రామంలో కలిశాయని, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు వచ్చాయని, సర్వే నంబర్లో ఉన్న విస్తీర్ణం ఆన్లైన్లో కనిపించడంలేదని, చనిపోయిన వ్యక్తికి భూమి లేకపోయినా 30 ఎకరాలు భూమి ఉన్నట్లు ఆన్లైన్లో కనిపించడం వలన భూముల క్రయవిక్రయాలు చేయలేకపోతున్నామని జేసీకి పలువురు రైతులు వివరించారు. క్షేత్ర స్థాయిలో సర్వే చేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్రాజ్, తహసీల్దార్ ఈశ్వరరావు, నూజివీడు సీఐ కె. రామకృష్ణ, సర్పంచ్ చల్లగుళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాత నేరస్తులు 9 మంది బైండోవర్



నూజివీడు మండల మేజిస్ట్రేట్, తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసిన పాతనేరస్తులు

నూజివీడు: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 9 మంది ఎక్సైజ్ పాత నేరస్తులను మంగళవారం తహసీల్దార్, మండల మేజిస్ట్రేట్ గుగులోతు భద్రు వద్ద హాజరుపరిచి బైండోవర్ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ బైండోవర్ ఏడాది పాటు ఉంటుందని, ఈ కాలంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసుకొని జీవించాలని సూచించారు. అనంతరం ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య మాట్లాడుతూ నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆగిరిపల్లి, నూజివీడు, ముసునూరు, చాట్రాయి మండలాల్లో బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై, సారా తయారు చేసి విక్రయించే వారిపై, నల్లబెల్లం సరఫరా చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్లపు ఊట ఉన్న భూముల యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్సైజ్ నేరాలు జరుగుతున్నట్లు తెలిస్తే సెల్ నంబర్ 94409 02462కి సమాచారం అందించాలని కోరారు.

పోతురెడ్డిపల్లిలో పల్లె నిద్ర



మాట్లాడుతున్న ఎస్ఐ జ్యోతిబసు

నూజివీడు: గంజాయి, మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని రూరల్ ఎస్ఐ జి. జ్యోతిబసు అన్నారు. పోతురెడ్డిపల్లిలో సోమవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని ఎస్ఐ నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గంజాయి విక్రయించే వారి సమాచారం తెలిస్తే తక్షణమే స్థానిక పోలీసులకు గాని, డయల్ 112కి గాని సమాచారం అందించాలన్నారు. ఇళ్లల్లో దొంగతనాలను అరికట్టడానికి స్థోమత ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీనివల్ల దొంగతనం జరిగినప్పటికీ దొంగను పట్టుకోవడం సులవవుతుందని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 ద్వారా సమాచారం ఇస్తే పది నిమిషాల్లో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుంటారన్నారు. ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు ఎక్కువ అవుతున్నాయని, చదువుకున్న వారే ఎక్కువగా సైబర్ నేరాలకు గురవుతున్నారన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి సమాచారం అందించాలని చెప్పారు. వేసవి సెలవుల్లో పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా విహారయాత్రలకు గానీ, నదీ ప్రాంతాలకు గానీ, చెరువు ప్రాంతాలకు గాని వెళ్లిన సమయాల్లో జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి



కొండపల్లిలో నివాళులర్పిస్తున్న జేవీవీ నాయకులు, విద్యార్థులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన కందుకూరి వీరేశలింగం పంతులు గొప్ప సంఘ సంస్కర్త అని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు అన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి కార్యక్రమం కొండపల్లి శాఖ గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కామేశ్వరరావు మాట్లాడుతూ వీరేశలింగం పంతులు వితంతువులకు శరణాలయాలు, మహిళలు, బాలికల విద్యకు పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పారని కొనియాడారు. చిన్న వయస్సులో భర్త మరణిస్తే పునర్వివాహం చేసుకునేందుకు బహిరంగ సభల ద్వారా ప్రోత్సహించారని చెప్పారు. ఆయన సేవలను వివరించారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని యువత, విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. గ్రంథాలయ అధికారి డి.చంద్రశేఖర్, జేవీవీ సభ్యులు ఎస్.నాగరాజు, సీహెచ్ మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాత్రి గ్రామ ఉత్కర్ష్ అభియాన్కు రెండు గ్రామాల ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాఘవేంద్రనాథ్

నూజివీడు: గిరిజన గ్రామాల్లో సమగ్ర అభివృద్ధిని పెంపొందించేందుకు, ఆయా ప్రాంతాల్లో సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధిని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ధాత్రి ఆభా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ను సమర్థవంతంగా అమలు చేయాలని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 17న సిద్ధార్థనగర్లో, 18న ఓగిరాల తండాలో గ్రామ సభలను నిర్వహించాలన్నారు. ఈ పథకంలో గిరిజన పాఠశాలల అభివృద్ధి, గిరిజనులు నివసించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రోడ్లు, మంచినీటి సదుపాయాల అభివృద్ధి, చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడం, డిజిటల్ లైబ్రరీల సేవలు, సేంద్రియ సాగు, విద్య, వైద్యం తదితర వాటిని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు అభివృద్ధి అంశాలపై గిరిజనులకు సమగ్రంగా అవగాహన కల్పించడంతో పాటు తోడ్పాటు అందిస్తామన్నారు.

ఏలూరు జిల్లాలో 46 గిరిజన గ్రామాలు ఎంపిక కాగా వాటిల్లో ఓగిరాల తండా, సిద్ధార్థ నగర్లను కేంద్ర ప్రభుత్వమే ఎంపిక చేసిందని చెప్పారు. ఈ పథకం ద్వారా ఆయా ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

ఈలప్రోలు(ఇబ్రహీంపట్నం): ఈలప్రోలు గ్రామంలో డ్వాక్రా సంఘాల సభ్యులు నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్స్, ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పంచాయతీ రాజ్ శాఖ ఏడీసీ సుధాకర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కిచెన్ గార్డెన్స్తో వచ్చే కూరగాయలతో కుటుంబ సభ్యులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా అవుతారన్నారు. కూరగాయల మొక్కలు పెంచేందుకు అవసరమైన వర్మికంపోస్టును కంపోస్టు ఫిట్ల ద్వారా ఇంటి వద్దనే తయారు చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ రీ సైక్లింగ్పై అవగాహన కల్పించారు. డీఎల్పీఓ జీఎల్ఎన్వీ రాఘవన్, డీఆర్డీఏ పీడీ నాంచారయ్య, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.